

అనుమతుల పేరిట అడ్డదారి!

- మత్తడి వాగు ప్రాజెక్టులో అడ్డగోలుగా తవ్వకాలు
- రైతుపట్టా పాసు బుక్‌లతో పర్మిషన్ తీసుకుని అక్రమంగా వ్యాపారం
- యథేచ్ఛగా రూ.కోట్లు విలువచేసే మట్టి ఇటుక బట్టీలకు తరలింపు
- క్షేత్రస్థాయిలో జిల్లా అధికారుల పర్యవేక్షణ కరువు

ఆదిలాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులు, చెరువులు కుంటలు అడుగంటడంతో కొందరు అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతూ అక్రమదందా తెరలేపారు. అనుమతుల పేరిట కొందరు వ్యాపారాలు అడ్డదారి సంపాదనకు ఎగబడుతున్నారు. మత్తడివాగు, సాత్నాల ప్రాజెక్టులలో ప్రస్తుతం నీటిమట్టం పూర్తిగా అడుగంటింది. ఇదే అదునుగా కొందరు నల్లమట్టి వ్యాపారానికి తెర లేపుతున్నారు. రైతుల పంట పొలాల్లోకి నల్ల మట్టిని తరలిస్తున్నామంటూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసిన తెలియనట్లుగానే వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నల్లమట్టి కోసం రైతులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. కానీ క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించకుండానే అనుమతులు ఇవ్వడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికారులు హడావుడిగా అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గత పక్షం రోజులుగా మత్తడివాగు ప్రాజెక్టులో అక్రమంగా మట్టి తవ్వకాలను జరుపుతున్న సంబంధిత అధికారు లకు పట్టించే లేకుండా పోయిందుంటున్నారు. ఇటుక బట్టి వ్యాపారులతో కుమ్మక్కై కొందరు అధికారులు ఈ దందాలను నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఐదు మిషన్లకు పర్మిషన్ ఎందుకో..

మత్తడివాగు ప్రాజెక్టు నుంచి నల్లమట్టిని తరలించేందుకు అధికారులు ఐదుగురు రైతులకు పర్మిషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లోని పోన్నారి సుంకిడి వడ్డాడి తదితర గ్రామాలకు చెందిన రైతులు ఇరిగేషన్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఒక్కో రైతుకు ఒక జేసీబీ మిషన్ అవసరమని అధికారులు 5 మిషన్‌లకు పర్మిషన్ ఇవ్వడం విమర్శలకు దారి తీస్తోంది. ఎందుకంటే ఒక్క మిషన్ సహాయంతో 10 నుంచి 15 మంది రైతులు నల్లమట్టిని తరలించుకునే అవకాశం ఉంటుంది. రైతులు నల్ల మట్టిని ట్రాక్టర్ల సహాయంతో తరలిస్తారు. కానీ నిత్యం భారీ టిప్పర్, డంపర్‌ల సహాయంతో వందలాది వాహనాలలో నల్లమట్టిని తరలిస్తున్నా అధికారులు అడ్డుచెప్పడం లేదంటున్నారు. వ్యాపారుల ఒత్తిళ్లకు అధికారులు తలోగ్గారనే ఆరోపణలు లేకపోలేదు. రైతుల పట్టాపాసుబుక్కుల ఆధారంగానే నల్లమట్టి తరలింపు నకు పర్మిషన్ ఇచ్చామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

రాత్రీ, పగలు తవ్వకాలు..

రైతుల పేరిట అధికారులు పర్మిషన్ ఇవ్వడంతో సందట్లో సడేమియా అన్నట్లుగా ఇటుక బట్టీల వ్యాపారాలు మరింతగా రెచ్చిపోతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా నల్ల మట్టి తవ్వకాలను జరుపుతున్నారు. నిత్యం వందలాది వాహనాలలో ఇటుక బట్టీలకు మట్టిని తరలించుకుపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అధికారుల అనుమతులు ఉన్నాయంటూ దర్జాగా సమాధానం ఇస్తున్నారు. రూ.కోట్లు విలువ చేసే నల్ల మట్టి తరలిపోతున్న అధికారులు అడ్డుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అధికారులు నిఘా సారించి రాయల్టీని వసూలు చేస్తే నిత్యం లక్షల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇటుకల తయారీకి అనువైన మట్టి కావడంతో వ్యాపారాలు ఎగబడి తవ్వకాలు జరుపుతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు..

ప్రాజెక్టులు చెరువుల్లో అడ్డగోలుగా మట్టి తవ్వకాలతో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలంలో పలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. గతంలో భారీ నీటి గుంతల్లో పడి పలువురు మృతిచెందిన దాఖలాలు ఉన్నాయి. అడ్డగోలుగా తవ్వకాలను చేపట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక రైతులు చెబుతున్నారు. అలాగే కిలోమీటర్ల మేర నల్ల మట్టిని భారీ వాహనాలలో తరలించడంతో బీటీ రోడ్లు పూర్తిగా ధ్వంసమైపోతున్నాయి. కొందరు ఇష్టారాజ్యాంగా వ్యవహరించడంతో తీవ్రనష్టం వాటిల్లుతుందన్న వాదనలు వినిపిస్తు న్నాయి. ఇకనైనా ఈ దందాపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఐదు రోజులకే పర్మిషన్ ఇచ్చాం..

- విఠల్ (ఈఈ నీటిపారుదల శాఖ ఆదిలాబాద్)

నల్ల మట్టి కోసం కొంత మంది రైతులు దరఖాస్తు చేసుకోవడంతో ఐదురోజుల కోసం పర్మిషన్ ఇచ్చాం. గత పక్షం రోజులుగా నల్ల మట్టిని తరలిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. వెంటనే పర్మిషన్‌లను పరిశీలించి వాహనాలను నిలిపివేస్తాం. అక్రమంగా ఇటుక బట్టీలకు నల్ల మట్టిని తరలిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.



- ప్రాజెక్టు నుంచి నల్లమట్టిని తరలిస్తున్న వాహనాలు



వివరాలను తెలుసుకున్న సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్

జొన్నల కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలి

- ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్

ఇంద్రవెల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జొన్నల కొనుగోళ్లు చేపట్టాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ష సూచనలు ఉన్నందున రైతులకు ఇబ్బంది కలగకుండా జొన్నల కొనుగోళ్లు జరపాలని సూచించారు. వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని రాం నగర్ కాలనీలో కొత్తరేషన్ కార్డులు జారీ ప్రక్రియ పరిశీలించారు. తదనంతరం రేషన్ షాపు-1ను తనిఖీ చేశారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, తదితరులు ఉన్నారు.

18 వరకు జొన్న పంట కొనుగోళ్లు

బోథ్, మే 15 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని దనూర్ (బీ) గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలో ఈనెల 18 వరకు పంట కొనుగోళ్లను జరుపుతామని కేంద్రం ఇన్‌చార్జి గోలిస్వామి పేర్కొన్నారు. 18వ తేది సాయంత్రం ఐదు గంటల లోపు రైతులు తమ జొన్న దిగుబడులను మార్కెట్‌కు తీసుకురావాలని కోరారు.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి: మార్క్‌ఫెడ్ డీఎం

ఇంద్రవెల్లి, మే15 (ఆంధ్రజ్యోతి): జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.3371లను ప్రకటించిందని అన్నారు. రైతులు జొన్నలు దళారుల వద్దకు తీసుకెళ్లి మోసపోకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి అమ్మాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సీఈవో ధర్మసింగ్, డిప్యూటీ సీఈవో తుమ్మల సునీల్, సహకార సంఘం సిబ్బంది లక్ష్మణ్, సురేష్, తదితరులున్నారు.



జొన్నల కొనుగోళ్లను పరిశీలించిన మార్క్‌ఫెడ్ డీఎం

గంజాయి స్వాధీనం: ఒకరి అరెస్టు

భీంపూర్, మే15 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ బస్టాండ్ వద్ద గురువారం పోలీసులు తనిఖీ చేస్తుండగా 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జైనథ్ మండలం సాత్నాల గ్రామానికి చెందిన యాసిన్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నారు. అతని వద్దనుంచి 500 గ్రాముల ఎండు గంజాయి (విలువ సుమారు రూ.12,500)ని స్వాధీనం చేసుకుని ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ సాయినాథ్, ఎస్ఐ పీర్‌సింగ్ నాయక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది యువకులు గంజాయికి అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, యువకులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. గంజాయి అమ్మే వారిపైనా, సాగుచేసే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

లంబాడాలను ప్రభుత్వం ఇబ్బంది పెట్టొద్దు

- లంబాడా హక్కుల పోరాట సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు భారత్ చవాన్

నార్నూర్, మే15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం షెడ్యూల్డ్ తెగల అంశానికి రాగానే వివక్ష చూపుతోందని, లంబాడాలను ప్రభుత్వం ఇబ్బంది పెట్టొద్దని లంబాడా హక్కుల పోరాట సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు భారత్ చవాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సేవలాల్ భవన్ వద్ద కుల సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ షెడ్యూల్డ్ తెగలు మధ్య గొడవ సృష్టించే విధంగా తమ కుల ధ్రువీకరణ పత్రం కోసం చాలా రకాల నియమ నిబంధనలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. గత ప్రభుత్వాలు ఎప్పుడైతే తమ కులాన్ని షెడ్యూల్డ్ తెగలుగా గుర్తించారో అప్పటినుంచి మేము లంబాడాగా గుర్తింపు పొందామన్నారు. తాము వలస లంబాడాలకు వ్యతిరేకమని, అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల షెడ్యూల్డ్ తెగలు అన్నప్పుడు అందరినీ సమానం చూడాలని, గోండ్, ప్రధాన్, తోటి, కొలాంలకు ఒక న్యాయం, లంబాడాకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఒక్కొక్కరికీ ఒక న్యాయం అంటే కుదరదు అని హెచ్చరించారు. లంబాడా కులానికి ప్రభుత్వం న్యాయం చేయకుంటే పెద్దఎత్తున్న ధర్నా చేపడతామని అన్నారు. వెంటనే తమ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నార్నూర్ పాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడె, మధుకర్ జాదవ్, చంద్రకాంత్ జాదవ్, విటిడిఎ చైర్మన్ డిగంబర్‌ఆడె, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కైలాష్ జాదవ్, ఉమ్రి మాజీ సర్పంచ్ సంతోష్, బిక్కు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భరత్ చవాన్



వివరాలు వెల్లడిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

అధిక సంపాదన కోసం యువతకు మత్తు మందు విక్రయం

- మత్తు ఇంజెక్షన్లతో అక్రమ దందా
- గంజాయికి ప్రత్యామ్నాయంగా మత్తెక్కించే ఎత్తుగడ
- 1ఎంఎల్ మిడజోలం ఇంజెక్షన్‌కు రూ.500 వసూలు
- మాఫియాగా ఎక్స్‌రే టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్లు
- మత్తు మందు మాఫియా గుట్టు రట్టు చేసిన నిర్మల్ ఎస్పీ
- నలుగురిపై కేసు నమోదు.. మత్తు మందుల స్వాధీనం

.... వివరాలు 6లో




దొంగల దాడిలో గాయపడిన రైతులు

జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులపై దొంగల దాడి

- పలువురు రైతులకు తీవ్రగాయాలు
- దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

ఆదిలాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జొన్నల కొనుగోలు కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. రైతులు నిద్రిస్తున్న సమయంలో కొంతమంది దుండగులు జొన్నపంటను దొంగలించేందుకు ప్రయత్నించారు. దీంతో అడ్డుకునే ప్రయత్నం చేసిన రైతులపై కర్రలు రాళ్లతో ఎదురుదాడికి దిగారు. ఈ ఘటనలో రాంపూర్ గ్రామానికి చెందిన దిలీప్‌రెడ్డి, భరంపూర్ గ్రామానికి చెందిన నారాయణ అనే ఇద్దరు రైతులకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో పట్టణ టూ టౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని గాయపడిన రైతులను రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. జొన్నల దొంగతనానికి పాల్పడిన బన్నీ, వినయ్, నగేష్‌తోపాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దొంగత నానికి పాల్పడిన వారంతా ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి చెందినవారీగా గుర్తించారు. గురువారం ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో దొంగల దాడిలో గాయపడిన రైతులను మాజీమంత్రి జోగు రామన్న పరామర్శించారు.



రైతులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

బేల, మే 15 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శివచరణ్ రైతులకు సూచించారు. మండలంలోని చెప్రాలలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనల ప్రకారం యాజమాన్య పద్ధతుల్లో వ్యవసాయం చేసి తక్కువ ఖర్చులతో లాభాలు పొందాలని సూచించారు. రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మెళకువలు పాటిస్తే దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు

- సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన వారికి అందించే బాధ్యత కార్యకర్తలదే..
- రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్
- గ్రామస్థాయి నుంచి బ్లాక్ స్థాయి వరకు నూతన కమిటీలు

తలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేవారికి పార్టీ పదవులు వస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించే బాధ్యత కార్యకర్తలదేనని తెలంగాణ రాష్ట్ర ఉర్దూఅకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. గురువారం మండలంలోని రుయ్యడిలో మూడు మండలాలు తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో సంస్థాగత నిర్మాణం సన్నాహక విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహిర్‌బిన్ హందాన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్లా సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా తాహిర్ బిన్ హందాన్, చిట్లా సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ బలపడాలంటే ప్రతీ కార్యకర్త కృషిచేయాలని, అర్హులైన నాయకులకు కచ్చితంగా పదవులు వస్తాయని అన్నారు. నాయకత్వం అందరికీ అవకాశం ఇస్తుందని, క్షేత్రస్థాయిలో పనిచేసి కాంగ్రెస్ పార్టీకి మద్దతును పెంచాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయాన్ని సాధించేందుకు మన అందరమూ కలిసికట్టుగా పనిచేయాలని ఆకాంక్షించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలో తలమడుగు మండలంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులు గెలవడం ఎంతో అభినందనీయమన్నారు. ఇప్పుడు కూడా తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అధికారులతో కాకుండా కార్యకర్తల ద్వారా పంపిణీ కావాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెప్పిన వారికి ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, సీనియర్ నాయకులు నరేష్ జాదవ్, మాజి జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, తలమడుగు, భీంపూర్, తాంసి మండల అధ్యక్షులు కళ్యాణ రాజేశ్వర్, అశోక్, కొడాల నారాయణ, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోత రెడ్డి, తలమడుగు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సాయి, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, శ్రావణ్ నాయక్, కొడల సంతోష్, సంజీవ్ రెడ్డి, గాజుల సాంబశివు కొమురు జ్ఞానేశ్వర్ మల్లేష్, సత్య నారాయణ, ఎండి సద్దాం, సతీష్ నాయక్, నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్



హాజరైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు

బీఆర్‌ఎస్ నాయకులు పిచ్చెక్కి మాట్లాడుతున్నారు: మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

బీఆర్‌ఎస్ నాయకులకు పదవులు పోవడంతో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. రుయ్యాడిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల అధికారంలో ఉన్నా ఆ పార్టీలో ఎలాంటి స్వేచ్ఛా లేదని అన్నారు. ప్రజలకు ఇచ్చినహామీలను సైతం నెరవేర్చలేకపోయానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయని అన్నారు. అభివృద్ధిని ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు పిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీగా గెలిపించాలని కోరారు.

అధిక సంపాదన కోసం...

యువతకు మత్తు మందు విక్రయం

- మత్తు ఇంజెక్షన్లతో అక్రమ దందా
- గంజాయికి ప్రత్యామ్నాయంగా మత్తెక్కించే ఎత్తుగడ
- 1ఎంఎల్ మిడజోలం ఇంజెక్షన్‌కు రూ.500 వసూలు
- మాఫియాగా ఎక్స్‌రే టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్లు
- మత్తు మందు మాఫియా గుట్టు రట్టు చేసిన నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల
- నలుగురిపై కేసు నమోదు..
- 26 మిడజోలం ఇంజెక్షన్లు, 10 సిరంజీలు, నాలుగు సెల్‌ఫోన్ల సీజ్


పోలీసులకు పట్టుబడ్డ మిడజోలం ఇంజెక్షన్లు


పోలీసులు స్వాధీనం చేసుకున్న సిరంజీలు, సెల్‌ఫోన్లు



వివరాలు వెల్లడిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్, మే15 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంజెక్షన్ల వాడకం ప్రమాదమని తెలిసినా అధిక సంపాదనే ధ్యేయంగా యువత ప్రాణాలతో చెలగాటమాడేందుకు మాఫియాగా ఏర్పడి కొంతమంది సాగిస్తున్న అక్రమ దందాకు నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల చెక్ పెట్టారు. గురువారం సదరు డ్రగ్స్ మాఫియా బృందాన్ని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే ఎస్పీ జానకీ షర్మిల తెలిపిన కథనం ప్రకారం.. అత్యవసర సమయంలో శస్త్ర చికిత్సల సమయంలో ఉపయోగించే మిడజోలం అనే మత్తు మందును యువతకు విక్రయించి తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో నిర్మల్‌కు చెందిన ఎక్స్‌రే టెక్నీషియన్ షేక్ ఫర్ దిన్, విద్యార్థి మహమ్మద్ పర్వేజ్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు చౌహాన్ గోవింద్, మహమ్మద్ అబ్దుల్ డానిష్ ఒక మాఫియాగా ఏర్పడ్డారు. షేక్ ఫర్‌దిన్ మూడేళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుండడంతో మందులపై అతనికి ఉన్న అవగాహనతో యూట్యూబ్‌లో మిడజోలం ఇంజెక్షన్‌ను ఎలా తీసుకుంటారో తెలుసుకున్నాడు. అది తీసుకోవడం ద్వారా మనిషికి ఎంత మత్తును ఎక్కిస్తుందో తెలుసుకొని తన మిత్రులైన పర్వేజ్, చౌహాన్ గోవింద్, మహమ్మద్ డానిష్‌లకు తెలిపాడు. ఈ విషయంవిన్న మిగతా మిత్రులు కూడా ఈ ఇంజక్షన్‌తో అక్రమ వ్యాపారం ప్రారంభించేందుకు ఒప్పుకున్నారు. ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆవతో ఈ ఇంజక్షన్లు ఎవరెవరు తీసుకుంటారో తెలుసుకునేందుకు ఎత్తుగడ వేశారు. అనుకున్నదే తడవుగా షేక్ ఫర్‌దిన్, చౌహాన్ గోవింద్, మహమ్మద్ అబ్దుల్ డానిష్‌లు నిర్మల్‌లోని హాస్పిటల్‌ల నుంచి మిడాజోలం ఇంజెక్షన్‌ను, సిరంజీలను సేకరించారు. ఇంజెక్షన్‌ను సేకరించడం వీరి వంతుగా మహమ్మద్ పర్వేజ్‌కు కస్టమర్ల దగ్గరికి వెళ్లి వారిని నిర్మల్‌లోని బైల్‌బజార్ ఏరియాకు తీసుకువచ్చే బాధ్యతను అప్పగించారు. ఇలా ఈ నలుగురు కలిసి ఈ ఇంజెక్షన్‌ను గంజాయి తాగే వారికి అలవాటు చేసేందుకు ఇది గంజాయి కంటే ఎక్కువ మత్తు ఇస్తుందని నమ్మకం కలిగించేవారు. ఈ ఇంజెక్షన్‌ను తామే ఇస్తామని యువతకు నమ్మబలికి వారికి 1ఎంఎల్ ఇంజెక్షన్‌కు గాను రూ.500 వసూలు చేసేవారు. ఇలా ఇంజెక్షన్లు ఇవ్వడం ప్రమాదం అని తెలిసినా అధిక సంపాదన కోసం యువతప్రాణాలతో చెలగాటమాడి వచ్చిన డబ్బులను సమానంగా పంచుకునేవారు. మత్తు మందుల వినియోగాన్ని చిత్తు చేయడమే లక్ష్యంగా గత కొంతకాలంగా నిర్మల్ జిల్లా పోలీసులు సాగిస్తున్న నిఘాలో భాగంగా ఈ మాఫియా ఆగడాలు పోలీసుల దృష్టికి వచ్చాయి. దీంతో జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఈ మాఫియా బృందాన్ని పట్టుకునేందుకు పకడ్బందీ ప్రణాళిక వేసి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 26 మిడజోలం మత్తు ఇంజెక్షన్లు, పది సిరంజీలు, నాలుగు సెల్‌ఫోన్‌లను పోలీసులు సీజ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పై నలుగురు నిందితులను అరెస్ట్‌చేశారు.

వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వొద్దు: ఎస్పీ

మత్తు ఇంజెక్షన్లను మెడికల్ షాపులలో వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవ్వకూడదని నిరల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశించారు. ఆసుపత్రిలో ఉపయోగించే మత్తు ఇంజెక్షన్ ఇన్వెంటరీని హాస్పిటల్ యాజమాన్యాలు సరిగా పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను జాగ్రత్తగా గమనించి ఏదైనా తేడా కనిపిస్తే డీఅడిక్షన్ సెంటర్‌లో చేర్పించాలని సూచించారు. నిర్మల్‌ను డ్రగ్స్‌రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు సంబంధించి సమాచారం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 8712659599 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఉపేందర్ రెడ్డి, రాజేష్ మీనా, నిర్మల్ టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై నరేష్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఏఆర్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి

- ఉద్యోగోన్నతితో బాధ్యతలు పెరుగుతాయ్: ఆదిలాబాద్ ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతితో బాధ్యతలు మరింత అధికమవుతాయని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఏఆర్ కానిస్టేబుల్స్ నుంచి హెడ్ కానిస్టేబుల్స్ ఉద్యోగోన్నతి పొందిన ఏడుగురు పోలీసు అధికారులకు గురువారం ఆదిలాబాద్‌లోని పోలీసు ముఖ్య కార్యాలయంలో ఉద్యోగోన్నతి చిహ్నాన్ని అలంకరించి అభినందించారు. బాధ్యతగా, క్రమశిక్షణతో డ్యూటీ చేయాలని వారికి సూచించారు.

టీపీసీసీ పరిశీలకులకు సన్మానం


తాహెర్‌బిన్ హందాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

మావల, మే15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, పరిశీలకులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణలను కిసాన్ కాంగ్రెస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. గురువారం బోరంచు శ్రీకాంత్ రెడ్డి నివాసంలో జిల్లా కాంగ్రె స్ నాయకులు భేటీ అయ్యారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మాజీ టీటీడీ బోర్డుమెంబర్ అనిల్, బోథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.


అటవీ శాఖ అధికారులతో వాగ్వివాదానికి దిగిన పోడు రైతులు

అటవీ భూముల్లో విత్తనాలు చల్లడంపై అధికారులు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం

నేరడిగొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీచర, రాంపూర్ గ్రామాల రైతులకు సంబంధించిన అటవీ భూముల్లో రెండు రోజులుగా విత్తనాలు చల్లడంపై గురువారం అటవీ అధికారులు, పీచర గ్రామస్థుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామంలో అటవీహక్కు పత్రాలు ఉన్న ఆదివాసీ రైతులకు చెందిన 15ఎకరాల భూముల్లో అటవీ అధికారులు విత్తనాలు చల్లారని రైతులు ఆరోపించారు. దీంతో గురువారం అక్కడ గ్రామస్థులు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రైతులు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దృష్టికి తీసుకెళ్లగా డీఎఫ్‌వో మాట్లాడతానని ఆయన చెప్పినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ల సమస్యలను పరిష్కరిస్తామని డీడబ్ల్యూఓ మిల్కా అన్నారు. ఆదిలాబాద్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ట్రాన్స్ జెండర్‌తో డీడబ్ల్యూఓ మిల్కా గురువారం సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్‌లకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు గురించి వారికి వివరించారు. ట్రాన్స్‌జెండర్ కార్డు ఇప్పటివరకు తీసుకోనివారు ఆలస్యం చేయకుండా వెంటనే తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. రిమ్స్‌లో మైత్రీ క్లినిక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్‌లు పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

భీంపూర్, మే15 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని అర్లి(టి)లో గురువారం ఎక్సైజ్ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో అశోక్ అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. అశోక్ వద్ద నుంచి 68 (90 ఎంఎల్) దేశిదారు సీసాలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని అశోక్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక

ఖానాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇంచార్జ్ అంకం మహేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల శ్రీనివాస్ సమక్షంలో పట్టణ పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్ తెలిపారు. స్థానిక విశ్రాంతి భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు జెట్టి సురేందర్, ఆసం సాయి, మాదాసు మురళి, దానపెల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శులు కొండేవణి రమేష్, దాసరి శ్రీనివాస్, కార్యదర్శులు కత్తుల శ్రీకాంత్, బి. సుమంత్, దుర్గి అజయ్ గౌడ్, పంబాల ప్రశాంత్, కోశాధికారిగా అన్నపెన్న రాజశేఖర్‌లను నియమించినట్లు మనోజ్ పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులుగా మరో 34 మందితో పూర్తిస్థాయి పార్టీ పట్టణ కమిటీని ప్రకటించారన్నారు.

పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి


- పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్

నిర్మల్ అర్బన్, మే (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషిచేయలని పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్ పిలుపునిచ్చారు. రాజరాజేశ్వర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, పీసీసీ పరిశీలకులు అవేజ్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ హాది, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు అజార్, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, మాజీ ఎంపీపీ సాధ సుదర్శన్ పాల్గొన్నారు.

'కొనుగోళ్లు వేగవంతం చేయండి'

కుంటాల, మే, 15 : (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్మల్ పౌరసరఫరాల శాఖ డీఎం సుదర్శన్ అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాలతో పాటు కల్లూరు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు కొను గోలు కేంద్రాలలో సిబ్బంది కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట కొనుగోలు కేంద్రం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ముథోల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో ఇటీవల జరిగిన ఘటనలో దళితులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన ముథోల్‌లోని నాగార్జున నగర్‌లో దళిత సంఘాల నాయకులు, బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బోరిగాం గ్రామంలో బుద్ధ విగ్రహాన్ని అధికారులు తొలగించటం సరికాదన్నారు. వెంటనే అదే స్థలంలో బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దాడిలో గాయపడ్డ మహిళలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని వారు కోరారు. ఈ ఘటనలో అరెస్ట్ అయిన దళితులను వెంటనే విడుదల చేయలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమతా సైనిక్ దళ్ ఉపాధ్యక్షుడు నారాయణ వాగ్మారే, భీమ్ ఆర్మీ నిర్మల్ జిల్లా మాజీ అధ్యక్షుడు హౌజేకర్ ప్రకాష్, సమతా సైనిక్ దళ్ ముథోల్ మండల అధ్యక్షుడు విశ్వంబర్, నాయకులు శ్రావణ్, శంకర్, గంగాధర్, కీర్తిరత్న, రాహుల్ పాల్గొన్నారు.

వచ్చే ఖరీఫ్ నుంచి రైతాంగానికి సాగునీరు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్


సిరాల ప్రాజెక్టు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండలంలోని సిరాల గ్రామంలో సిరాల ప్రాజెక్టును గురువారం పరిశీలించారు. 12 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న పనులు 90 శాతం పూర్తికావడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే ఖరీఫ్ నుంచి రైతాంగానికి సాగునీరు అందించేందుకు కృషిచేస్తానన్నారు. భారీ వర్షాలతో సిరాల ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో తాను ఎమ్మెల్యే అయ్యాక ప్రభుత్వం ప్రాజెక్టు పునర్నిర్మాణానికి 12 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే సిరాల, ఇలేగాం, దేగాంతో పాటు ఆయా గ్రామాల రైతులకు సాగునీరు అందుతుందన్నారు. పనులు పూర్తిచేసిన కన్స్ట్రక్షన్స్ యాజమాన్యానికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. రైతుల సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డికి, జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు చెప్పారు. ప్రాజెక్టు పూర్తి చేసినందుకు ఆయకట్టు రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఇరిగేషన్ డీఈ అనిల్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, సీనియర్ నాయకులు సాంప్లీ రమేష్, బీజేపీ మండల అధ్యక్షురాలు సీరం సుష్మ రెడ్డి, నాయకులు పండిత్ రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు భూమేష్, ఆయా గ్రామాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు వరంగా ముఖ్యమంత్రి సహాయ నిధి

- ముథోల్ మాజీఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్


చెక్కులు పంపిణీ చేస్తున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే

భైంసా, మే 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యపు సమస్యలతో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యసేవలు పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంగా నిలుస్తోందని ముథోల్ మాజీఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్‌పాటిల్ పేర్కొన్నారు. గురువారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 40 మందికి పైగా లబ్ధిదారులకు రూ.20 లక్షలకు పైగా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వైద్య చికిత్సల కోసం చేసిన వ్యయభారాన్ని ,అర్థిక ఇబ్బందులను తొలగించేందుకు గాను సీఎం రిలీఫ్ పండ్ ద్వారా తోడ్పాటునిస్తున్నామని వివరించారు. ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందిన బాధితులు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అర్థిక సహాయం పొందేందుకు గాను చికిత్సలకు సంబంధించిన పూర్తి వివరాలతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలు,వసతులు మెరుగుపరచి అధునిక వైద్య సేవలు అందుబాటులో తీసుకవచ్చేందుకుగాను ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతోందన్నారు. గత ప్రభుత్వాలతో పోల్చి చూస్తే ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పూర్తి స్థాయిలో మెరుగయ్యాయని వెల్లడించారు. ఇందులో భైంసా, ముథోల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డి, మాజీ ఎంపీపీ రాంచందర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ శ్యామ్‌రావ్ పాటిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ

నిర్మల్ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : కడెం వైపు నుంచి నిర్మల్ వైపు వస్తున్న ఆటోను కొండాపూర్ వద్ద గురువారం తనిఖీ చేయగా నిషేధిత గంజాయితో పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... కడెం మండలం చింతగూడ తండా, అల్లంపెల్లి గ్రామానికి చెందిన నూర్‌సింగ్ ఆటోలో సుమారు 1.907 కేజీల ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి రవాణా చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ, ఎస్సై లింబాద్రి, ఏఎస్సై బాపురావు, పోలీస్ సిబ్బంది రాజేశ్వర్, సంతోష్, అజీజ్, జితేందర్, బాలాజీలను జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- రూ. 50 వేలు విలువ చేసే 1.2 కిలోల గంజాయి స్వాధీనం

ఖానాపూర్ : గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఖానాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే సీఐ అజయ్ తెలిపిన కథనం ప్రకారం... షేక్ సలీం అలియాస్ ఉమర్ అనే వ్యక్తి బుధవారం సాయంత్రం ఖానాపూర్ బస్టాండ్ ప్రాంతంలో గంజాయి అమ్మడానికి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఖానాపూర్ ఎస్సై రాహుల్ సిబ్బందితో కలిసి బస్టాండ్ ప్రాంతంలో తనిఖీ నిర్వహించగా పోలీసులను చూసి సలీం పారి పోయే ప్రయత్నం చేశాడు. సంచితో పాటు పారిపోయే ప్రయత్నం చేస్తున్న సలీంను పోలీసులు పట్టుకొని తనిఖీలు నిర్వహించగా అతని సంచిలో 1.2 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అతడిని పట్టు కుని విచారించగా తాను మెట్‌పల్లి ప్రాంతంలో గంజాయి కొని ఖానాపూర్‌లో ఎవరికైనా అమ్మేందుకు వచ్చినట్లు తెలిపినట్లు సీఐ తెలిపారు. సులభంగా ఎక్కువ డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో గంజాయి అమ్ముతున్నట్లు సదరు నిందితుడు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. గతంలో నిందితుడిపై 14 చోరీ కేసులు సైతం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.50 వేల వరకు ఉంటుందని సీఐ అజయ్ పేర్కొన్నారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.


కుంటాలలో పారిశుధ్యపనులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలి

కుంటాల, మే, 15 : (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం సమీపిస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాలలో పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలో పారిశుధ్యం పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మురికికాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, కాలువల్లో తీసిన చెత్తను ట్రాక్టర్ సహాయంతో డంపింగ్ యార్డుకు తరలించాలని, వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామాలలో జనావాసాల మధ్య నీరునిల్వ ఉండకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రహీం, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్ రైతులకు అవగాహన సదస్సు

ముథోల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మచ్కల్ గ్రామంలో గురువారం ఆయిల్ ఫామ్ ప్రీయూనిక్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ రైతులకు అవగాహన సదస్సు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భైంసా డివిజన్ ఏరియా మేనేజర్ ఆడెపు శంకర్ మాట్లాడుతూ... ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ఉన్న రాయితీ వివరాలు కొత్తగా నాటుకునే రైతులకు అవకాశం ఉందన్నారు. నాలుగు సంవత్సరాలు రాయితీ రూ. 4,200లు ఒక సంవత్సరం చొప్పున రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు రాయితీపై ఉన్నాయని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ పెట్టిన మొదటి సంవత్సరం నుంచి 30 నెలల వరకు వచ్చిన పూత గెలలను తొలగించాలని, మూడు సంవత్సరాలు పూర్తయిన తోటలో వచ్చే సంవత్సరం దిగుబడి వస్తాయి. ఆయిల్ ఫామ్ పంటకు వచ్చే చీడపీడలు మా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఆయిల్ ఫామ్ ఒక టన్ను ధర రూ. 21,000లు రైతులకు మంచి ఆదాయం ఇచ్చే పంట ఆయిల్ ఫామ్ అని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు మండలంలోనే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు గంగాధర్ పటేల్, చక్రధర్ పటేల్, దీపక్, దత్తు ఫీల్డ్ అసిస్టెంట్, మండల ఆయిల్ పామ్ క్లస్టర్ ఆఫీసర్ మొయిన్ మియ్యా, తదితరుల పాల్గొన్నారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

తానూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలింగి గ్రామానికి చెందిన జాదవ్ మాయవతి (35) అనే వివాహిత గురువారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ట్రైయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి భర్త గౌతమ్ తన భార్యతో వంట చేయాలని చెప్పగా భార్య చేయలేదు. దీంతో భర్త గౌతమ్ ఇంటి బయటే పడుకున్నాడు. ఉద యం లేచి గౌతమ్ పనులకు వెళ్లగా భార్య క్షణికావేశంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరి మధ్య ఘర్షణ.. కేసు నమోదు

బాసర, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి మధ్య గొడవ పడిన ఘటనలో ఆ ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు బాసర పోలీసులు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం సాయంత్రం బాసర ఆలయంలో పనిచేసే పూజారి సంజీవ్‌కుమార్, రాజకీయ నాయకులు నూకం రామరావు మధ్య మాటమాట పెరిగి గొడవకు దారితీసింది. అనంతరం ఇరువురు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూజారి సంజీవ్ కుమార్, నూక రామారావుపై కేసు నమోదు చేసిన ట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఖానాపూర్‌లోని పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం



ఎర్వచింతల్‌లోని పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం



పీఏసీఎస్ సీఈవో రాసిచ్చిన హామీ పత్రాన్ని డీఎస్‌వో ఎదుట చదువుతున్న ఎర్వచింతల్ మాజీ సర్పంచ్ గోపాల్ (ఫైల్)



సీఈవో ఆశన్నపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎర్వచింతల్ రైతులు (ఫైల్)

ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ

- అందిన కాడికి దండుకుంటున్న కేంద్రం నిర్వాహకులు
- ధాన్యం తూకం వేసేందుకు బీహార్ నుంచి కూలీలు
- అధికారులు దృష్టి సారించాలంటున్నరైతాంగం
- అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆందోళనకు రైతుల సన్నాహాలు

ఖానాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : పగలనక.. రాత్రనక.. ఎండకన.. వాననక... శ్రమించి పండించుకున్న పంట చేతికందిన అన్నదాత ఆశలకు అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. జిల్లాలో వరి పంట చివరి దశకు చేరుకున్న తరుణంలో ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దళారులకు ధాన్యం విక్రయించి రైతన్న నష్టపోకూడదని ప్రభుత్వం ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. కోతలు పూర్తయిన రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకునేందుకు పంట కల్లాలకు ధాన్యంతో సహా చేరిపోయారు. ఇక అసలు కథ ఇక్కడే ప్రారంభమైంది. తమ ధాన్యం విక్రయించేందుకు వచ్చిన అన్నదాతకు సెంటర్ నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారు. తొలత ధాన్యం తేమ శాతం 17 వచ్చే వరకు ఆరబెట్టాలని చూసిన సెంటర్ నిర్వాహకులు ఆ తేమ శాతం క్రమేపి తగ్గి 10కి వచ్చిన ధాన్యం తూకం వేయడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా అన్నదాత నుంచి అందిన కాడికి దండుకోవాలని ఎత్తుకెత్తులను వేస్తూ ఎప్పటికప్పుడు కొత్త కొత్త నిబంధనలను రైతన్న ముందర పెడుతూ అదనపు ధాన్యాన్ని దోచుకునే పనిలో పడ్డారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బీహార్ ప్రాంతం నుండి కూలీలను తెచ్చి ఒక్కో క్వింటాల్ ధాన్యం వెంట రూ.10 నుంచి రూ.10 వరకు రైతన్న నుండి దండు కుంటూ దోపిడీకి పాల్పడుతున్నారని తెలుస్తోంది. దీంతో ఎంత మంది అధికారులకు మొరపెట్టుకున్న తమ బాధను పట్టించుకోవడం లేదని ఆగ్రహించిన అన్నదాత చివరికి మరో అడుగు ముందుకేసి ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ గ్రామంలో మంగళవారం ఖానాపూర్ పీఏసీఎస్ సీఈవో ఆశన్న సహా సిబ్బందిని నిర్బంధించి తమ ఆవేదనను ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చారు. అయినప్పటికీ అధికారులు స్పందించి ఈ అదనపు దోపిడీకి అడ్డుకట్ట వేయకపోతే మరో రెండు మూడు రోజుల్లో ఖానాపూర్ ప్రాంతంలో అన్ని రాజకీయ పార్టీలతో కలిపి అఖిల పక్షం ఏర్పాటు చేసి రైతాంగం ఆందోళనకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

హమాలీలకు కూలి తక్కువ .. వసూళ్లు ఎక్కువ

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు బీహార్ కూలీలు వరంలా మారారు. బీహార్ ప్రాంతం నుండి కూలీలను తీసుకువచ్చి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయిస్తున్నారు. స్థానికంగా హామీలీ పని చేసేందుకు కూలీలు అందుబాటులో లేరనే సాకుతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయించేందుకు బీహార్ నుంచి కూలీలను తేవడం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సిరులు కురిపిస్తోందని చెబుతున్నారు. బీహార్ నుంచి తీసుకొస్తున్న కూలీలకు తక్కువ డబ్బులు చెల్లించి రైతన్న వద్ద క్వింటాల్ ధాన్యం తూకం వేసేందుకు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయిలో పరిశీలన జరపగా బీహార్ నుంచి వచ్చి తర్లపాడ్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న రంజిత్, లాలు సింగ్, బిజిలి సింగ్ అనే కూలీలను పలకరించి వారికి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇస్తున్న హమాలీ ధరలను అడిగి తెలుసుకోగా వారికి 40 కిలోల బస్తా తూకం వేసి లారీలో లోడింగ్ చేసినందుకు గాను రూ. 12 అంటే క్వింటాల్‌కు రూ.30 చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైతుల మధ్య మాత్రం క్వింటాల్‌కు రూ. 40 చొప్పున వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అంటే ఒక్కో క్వింటాల్ ధాన్యం తూకం వేసేందుకు అదనంగా 10 రూపాయలను సెంటర్ నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నట్లు రైతులు ఆరో పిస్తున్నారు. మరోపక్క ఒక్కో ధాన్యం రాశిని (కుప్పను) తూకం వేసే సమయంలో రూ. 200ల నుంచి రూ. 500ల వరకు హమాలీలకు ఇచ్చి తంగా ఇవ్వాలంటున్నారని రైతులు చెబుతున్నారు. అంతే కాకుండా ధాన్యం తూకం ముగిసిన తర్వాత ఒక డబ్బా ధాన్యాన్ని హమాలీలకు ఇవ్వా లని సెంటర్ నిర్వాహకులే సూచిస్తున్నారని చెబుతున్నారు. అదనంగా క్వింటాల్‌కు రూ. 10 దండుకోవడమే కాకుండా ఒక రైతు ధాన్యం తూకం వేసేందుకు 200ల రూపాయల నుంచి 500ల వరకు వసూలు చేయడం, 10 కిలోల ధాన్యాన్ని తీసుకోవడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతన్నల వద్ద నిర్వాహకుల దోపిడీ తారాస్థాయికి చేరిందని చెబుతున్నారు.



ఎర్వచింతల్ గ్రామంలో నిర్బంధంలో ఉన్న పీఏసీఎస్ సీఈవో ఆశన్న, సిబ్బంది రాజేశ్వర్ (ఫైల్)

అదనపు ధాన్యం ఇచ్చినా తప్పని ఇబ్బందులు

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాల్సిన శాతం కంటే తప్ప, తాలు ఎక్కువ ఉందని సెంటర్ నిర్వాహకులు చెబుతుండడంతో ఈ మండే ఎండలలో ధాన్యాన్ని చెన్ని (జాలి) పడుతూ ఇబ్బంది పడలేక క్వింటాల్‌కు రెండున్నర కిలోల అదనపు ధాన్యాన్ని ఇచ్చేందుకు అన్నదాతలు సుముఖత వ్యక్తం చేశారు. అయినప్పటికీ మిల్లర్లు ఒప్పుకుంటలేరనే సాకుతో ధాన్యం కొనుగోలు చేశాక సైతం క్వింటాల్ వెంబడి మరో రెండున్నర కిలోల ధాన్యాన్ని అదనంగా కట్ చేస్తుండడం రైతన్నకు రుచించడం లేదు. ఇలా చేయడం ద్వారా క్వింటాల్‌కు ఐదు కిలోల చొప్పున నష్టపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. మిల్లుర్లు, సెంటర్ నిర్వాహకులు కుమ్మక్కై ఈ దోపిడీ దందా సాగిస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో క్వింటాల్‌కు ఐదు కిలోల ధాన్యం అంటే క్వింటాల్ ధాన్యం వెంబడి రైతుకు అందుతున్న మద్దతు ధరలో రూ. 115 కోల్పోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరలో మిల్లర్లు, సెంటర్ నిర్వాహకులు కలిసి దోపిడీకి పాల్పడుతుంటే తాము కష్టపడి పండించిన పంట ఆశించిన ధరకు అమ్ముకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతల్లో కట్టలు తెంచుకుంటున్న ఆగ్రహం

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న గోల్మాల్‌పై మీడియాలో ఎన్ని వార్తలు వచ్చినా రైతులు ఎంత గగ్గోలు పెట్టినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతల్లో ఆగ్రహం కట్టలు తెంచుకొని అధికారులను నిర్బంధించే పరిస్థితి తలెత్తు తోందంటున్నారు. ఇటీవల ఖానాపూర్ మండలం ఎర్వచింతల్‌లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సంబంధిత పీఏసీఎస్ సీఈవో ఆశన్న, సిబ్బంది రాజేశ్వర్‌ను రైతులు పాఠశాల గదిలో నిర్బంధించారు. రైతులు నిర్బంధించగానే తాను బస్తాకు 42 కిలోలు మాత్రమే తూకం వేయించేలా చర్యలు చేపడతానని 43 కిలోలు తీసుకోనని లిఖిత పూర్వకంగా తన తప్పును ఒప్పుకొని సీఈవో హామీ ఇచ్చారు. నిజంగా మిల్లర్లే ఇబ్బంది పెడుతుంటే సీఈవో బస్తా వెంబడి తూకం వేస్తున్న అదనపు ధాన్యంలో కిలో తక్కువ చేస్తానని ఎలా రాసిస్తాడని జిల్లా వ్యాప్తంగా రైతులు ఆలోచిస్తున్నారు. మిల్లర్లు, సెంటర్ నిర్వాహకులు అంతర్గత ఒప్పందంతోనే అన్నదాతల నుండి ఈ దోపిడీ జరుగుతోందని ఈ ఘటనలో రుజువయ్యిందని రైతులు మండిపడుతున్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీపై ఐక్య కార్యాచరణను రూపొందించేందుకు మరో రెండు మూడు రోజుల్లో ఖానాపూర్ ప్రాంతంలో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి అఖిల పక్షాన్ని ఏర్పాటు చేసేందుకు తెరవెనుక సన్నాహాలు ప్రారంభమైనట్లు చెబుతున్నారు. బుధవారం కొన్ని రాజకీయ పార్టీలు రైతు సంఘాల నాయకులు ఖానాపూర్‌లో సమావేశమై అఖిలపక్ష ఏర్పాటుపై చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లలో జరుగుతు న్న ఈ దోపిడీ దందాపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించి అన్నదాతకు అండగా నిలవాలని జిల్లా రైతాంగం కోరుతోంది.



అదనపు ధాన్యం కోసం ధాన్యాన్ని మిల్లుకు తరలించకుండా గత కొద్ది రోజుల క్రితం ఖానాపూర్‌లో నిలిచిపోయిన లారీ (ఫైల్)

514 బస్తాలు విక్రయించి రూ. 20 వేలు నష్టపోయా

● గోనెల వెంకటేష్, యువ రైతు, తర్లపాడ్



ఈ యాసంగిలో నేను పండించిన వరి పంట 514 బస్తాలు ఖానాపూర్ పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. బస్తాకు 42.5 కిలోల చొప్పున ఒకటిన్నర కిలోల అదనపు ధాన్యం తూకం వేయడంతో నేను రూ. 17,700 నష్టపోయాను. 205 క్వింటాళ్ల పైచిలుకు ధాన్యం తూకం వేయడం ద్వారా క్వింటాల్‌కు రూ. 40 చొప్పున తీసుకున్నారు. ఇలా క్వింటాల్‌కు పది రూపాయలు నా వద్ద నుండి రూ. 2,050 వరకు అదనపు డబ్బులను వసూలు చేశారు. మొత్తం ఈ యాసంగి పంట అమ్ముకునే సమయంలో కొనుగోలు కేంద్రాల దోపిడీతో రూ. 20 వేల వరకు నష్టపోయాను.

క్వింటాకు ఐదు కిలోల ధాన్యం తరుగు

● ఆశన్న, పీఏసీఎస్ సీఈవో, ఖానాపూర్



ప్రస్తుతం క్వింటాల్ ధాన్యం వెంబడి తరుగు పేరిట ఐదు కిలోల ధాన్యం తీసుకుంటున్నాం. క్వింటాల్ ధాన్యం తూకం వెసేందుకు రూ. 40 చొప్పున హమాలీ తీసుకుంటున్నాం. 43 కిలోలతో తూకం వేసిన మాట వాస్తవమే. ఇకపై 42 కిలోలు తూకం వేయాలని చెప్పాను. మిల్లులో ఏమైనా కట్ అయితే తర్వాత చూద్దామని చెప్పాను.



రైతులకు పంటలను కాల్చవద్దని చెబుతున్న ఏఈవో గణేష్

పంట వ్యర్థాలను కాల్చొద్దు

నర్సాపూర్(జి), మే 15 (ఆంధ్రజ్యోతి) : పంట వ్యర్థాలను కాల్చవద్దని నర్సాపూర్(జి) ఏఈవోలు చెంద్యాల గణేష్, రమ్య సూచించారు. తురాటికి చెందిన ఓ రైతు చేనులో గురువారం పంట వ్యర్థాలు కాలుస్తుండగా గమనించిన ఆమె మంటలను ఆర్పి వే యించారు. లోతు దుక్కులు దున్నడం ద్వారా పంట అవశేషాలు భూమిలో కుళ్లిపోయి ఎరువుగా మారుతాయని పేర్కొన్నారు. పం ట అవశేషాలను కాల్చడంతో నేలలోని సేంద్రియ కర్బనం నశించి పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, వానపాములు నశించి పోతాయని తెలిపారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

తానూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : పంట మార్పిడితో రైతులకు అధిక దిగుబడులు వస్తాయని ఏరువాక వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.నర్సయ్య అన్నారు. గురువారం మండలంలోని దహెగాం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. పంట మార్పిడితో రైతులకు కలిగే లాభాలను వివరించారు. తక్కువ యూరియా వాడకం, పంట ద్వారా ఆదాయిన్ని ఎలాం పొందాలో తెలియజేశారు. అదే విధంగా సాగు నీటిని ఆదా చేయడం వల్ల భూమిలో నీటి లోటు రాబోయే రోజుల్లో రాకుండా చేసుకోవచ్చని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. కార్తిక్, ఏఈవో సీరాజ్, మాజీ సర్పంచ్ నాగోరావు, రైతులున్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి

లక్ష్మణచాంద, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి గురువారం అన్నారు. మండలంలోని మునిపెల్లి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. మండలం మొత్తం మీద అడిగిన ప్రతిచోట ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురాల లింగారెడ్డి, మాజీ సర్పంచ్ మేడిపెల్లి గంగాధర్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ బొద్దు సాయన్న, గ్రామస్థులు కమల్‌కోట రాజు, నర్సారెడ్డి, కొండాపూర్ రాజారెడ్డి, కుమ్మరి నారాయణ, జుంజురు భూమేష్, నూతికాడి లింగారెడ్డి, పార్‌పెల్లి అనిల్ రెడ్డి, మేడిపెల్లి నవీన్, తదితరులు ఉన్నారు.



మునిపెల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సన్మార్గంలో పయనిస్తే సత్ఫలితాలు

● ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకుడు బొద్దుల అశోక్



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు



వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

భైంసా, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ సన్మార్గంలో పయనిస్తే అన్నింటా సత్ఫలితాలు ఉంటాయని ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకుడు బొద్దుల అశోక్ పేర్కొన్నారు. గురువారం భైంసాలోని వివేకానంద ఆవాసంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేటి పోటీతత్వ సమాజంలో రాణించేందుకు గాను విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే అన్ని రంగాలపై అవగాహన పెంచుకొని ముందుకు సాగాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలపై పట్టు పెంపొందించుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి దైవభక్తితో పాటు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. జాతీయ భావాలతో వ్యవహరిస్తూ సనాతమైన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ ఆచార వ్యవహారాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. నిత్యం ఆలయాల సందర్శన చేపడుతు ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలన్నారు. సమాజ సేవకు తమ వంతు బాధ్యాతయుత భాగస్వామ్యాన్ని అందించాలని సూచించారు. ఇందులో శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు శైలేష్ మాశెట్టివార్, ప్రతినిధి రంగు రవి, , సేవా భారతి జిల్లా అధ్యక్షులు ప్రతాప్ పాల్గొన్నారు.

అద్దె భవనంలో ట్రెజరీ కార్యాలయం



గత ఐదు సంవత్సరాల క్రితం కూలిపోయిన ట్రెజరీ కార్యాలయం



మార్కెట్ కమిటీ ఆవరణలో అద్దె భవనంలో కొనసాగుతున్న ట్రెజరీ

● ఇబ్బందుల్లో సిబ్బంది

బోథ్, మే 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన బోథ్ పట్టణంలో ఉన్న ట్రెజరీ భవనం కూలిపోయి ఐదు సంవత్సరాల గడిచిపోతున్నా నూతన భవనం నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సాధించక పోవడంతో కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఫలితంగా అందులో విధులు నిర్వహించే సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకప్పుడు రాజా టీవీతో ఉన్న కార్యాలయం కూలిపోవడంతో సిబ్బందికి అద్దె గది దిక్కయింది.

● పోలైన ఓట్లని ఇక్కడే నిలువ

గత పది సంవత్సరాల క్రితం వరకు ఎమ్మెల్యే ఎన్నికలలో పోలైన బ్యాలెట్ పేపర్లను కౌంటింగ్ అనంతరం ట్రెజరీ కార్యాలయంలోని సేఫ్టీ గదిలో నిల్వ ఉంచేవారు. అంతేగాక తాలూకా పరిధిలోని పలు మండలాల నుండి వచ్చిన అధికారులు వివిధ రకాల బిల్లులను ఈ కార్యాలయంలో పూర్తి చేయించుకుని వెళ్లేవారు. వచ్చిన అధికారులకు తహసిల్దార్ కార్యాలయం ఆదిత్యం ఇచ్చేది క్రమక్రమంగా ట్రెజరీ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయం కూలిపోవడంతో నైజాం కాలం నాటి రాజాటీవీ భవనం కోల్పోయింది. తహసీల్దార్ కార్యాలయం నూతన భవనంలోకి మార్చారు. అయితే ట్రెజరీ కార్యాలయం స్థానికంగా ఉన్న మార్కెట్ కమిటీ ఆధీనంలో ఉన్న ఓ భవనంలోకి మార్చి అద్దె చెల్లిస్తున్నారు.

● వసతులు లేక ఇబ్బంది

అద్దె భవనంలో కొనసాగుతున్న ట్రెజరీ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక కార్యాలయం పక్కనే ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని వినియోగించుకోవాల్సి వస్తుంది. మార్కెట్ కమిటీ కార్యాలయం మూసి ఉంటే ఉద్యోగుల ఇబ్బందులు వర్ణనాతీతం. ముఖ్యంగా మహిళ ఉద్యోగులు వివిధ పనులపై వచ్చే మహిళా ఉద్యోగులు ఇబ్బందులు గురవుతున్నారు. అధికారులు నూతనంగా ట్రెజరీ కార్యాలయాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

● ప్రభుత్వానికి విన్నవించాం : ట్రెజరీ ఆఫీసర్



నూతన భవనం ఆవశ్యకత గురించి అధికారులకు వివరించడం జరిగిందని బోథ్ ట్రెజరీ అధికారి సాగర్ పేర్కొన్నారు. స్థానికంగా కార్యాలయ అవసరాలకు అనుగుణంగా భవనాలు లేవని ఉన్న అందుబాటులో లేకపోవడంతో మార్కెట్ వారి సహకారంతో కేటాయించిన అద్దె భవనంలో నిర్వ హిస్తున్నామన్నారు. శాశ్వత భవనం మంజూరి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు.



కౌటా(బి) గ్రామ సమీపంలో నీటి కుంట ఎండుతుండటంతో చేపల వేట కోసం కొంగల వెతుకులాట

ఎండుతున్న చెరువు

● చేపల వేటలో కొంగలు

బోథ్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత రోజురోజుకు పెరిగిపోవడంతో జల వనరులు ఇంకిపోతున్నాయి. గుంటలు, చెరువులు ఎండిపోతుండడంతో అందులో నుంచి చేపలు బయట పడుతున్నాయి. అయితే కుంటలలో నిలువ ఉన్న నీరు తగ్గిపోతుండటంతో ఎండ వేడి తాళలేక లోపల ఉన్న చేపలు పైకి వస్తున్నాయి. అయితే విషయం గమనించిన కొంగలు చేపల వేటకు గుంపులు గుంపులుగా వచ్చి పడుతున్నాయి. చిన్న నీటి కుంటలు వందల కొంగలు చేపల వేటలో నిమగ్నమై ఉన్నాయి.

చట్టాలపై ఉపాధ్యాయులకు అవగాహన అవసరం

● జిల్లా న్యాయాధికారి రాధిక

నిర్మల్‌కల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఫోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధిక అన్నారు. గురువారం చాణక్య కళాశాలలో ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థినుల భవిష్యత్ కోసం ఫోక్సో చట్టం గురించి తెలుసుకోవాలని సూచించారు. కోర్స్‌డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఇన్‌చార్జ్ విద్యాసాగర్, డీఆర్పీలు పాల్గొన్నారు.



27వ ప్యాకేజీ కింద ప్రధాన కాలువ నిర్మాణ పనులు



దిలావర్‌పూర్ వద్ద అండర్ టన్నెల్ నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

పరిహారం.. పరిహాసం

నిర్మల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో సాగునీటి కాలువలు, ఆనకట్టల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకు ఆ భూములకు సంబంధించిన పరిహారం డబ్బులు అదకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం అలాగే కాళేశ్వరం ప్యాకేజీ నెంబర్ 27, 28 హైలెవల్ కాలువల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు గత 15 ఏళ్ల నుంచి పూర్తి స్థాయిలో పరిహారం డబ్బులు అందలేదు. సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం కోసం మొత్తం 1155 ఎకరాలకు సంబంధించిన భూమిని సేకరించారు. అయితే ఈ భూములను నిర్మల్ జిల్లాతో పాటు జగిత్యాల జిల్లాల రైతుల నుంచి సేకరించిన అధికారులు నిర్మల్ జిల్లా రైతులకు మాత్రం చెల్లింపులు జరిపి జగిత్యాల జిల్లా రైతులను విస్మరించారు. జగిత్యాలకు జిల్లాకు సంబంధించిన 55 ఎకరాల భూములకు గాను రూ.5కోట్ల 30 లక్షలను చెల్లించాల్సి ఉంది. కాగా నిర్మల్, ముథోల్ నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన 27, 28 నెంబర్ హైలెవల్ కాలువల కింద భూములు కోల్పోయిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దాదాపు 15ఏళ్ల క్రితం ఈ రెండు కాలువల నిర్మాణ పనులు చేపట్టినా ఇప్పటికీ ఆ పనులు పూర్తి కాలేదు. ముఖ్యంగా ముథోల్ నియోజకవర్గంకు సంబంధించి 28 నెంబర్ ప్యాకేజీ కాలువ పనులు 50 శాతం కూడా అధిగమించలేదు. సదర్మాట్ హైలెవల్ కాలువల భూములకు సంబంధించి పరిహారం డబ్బుల కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరిహారం డబ్బుల చెల్లింపులపై పూర్తి నిర్లక్ష్యం కొనసాగింది. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి రాగానే భూములు కోల్పోయిన రైతులందరూ ఈ సర్కారుపై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పరిహారం డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

- పరిహారం కోసం సదర్మాట్ కాళేశ్వరం నిర్వాహకుల ఎదురు చూపులు
- ఏళ్ల నుంచి పూర్తికాని ప్రక్రియ
- గత సర్కారు నిర్వాకంతో రైతులకు తిప్పలు
- ముందుకు సాగని 27, 28 ప్యాకేజీ కాలువల పనులు
- మంత్రి పొంగులేటిపైనే ఆశలు

28వ ప్యాకేజీ కాలువ నిర్వాసితుల గోడు

ముథోల్ నియోజకవర్గంలో 55 వేల ఎకరాలకు సాగు నీరందించాలన్న లక్ష్యంతో నిర్మించ తలపెట్టిన 28వ నెంబర్ ప్యాకేజీ హైలెవల్ కాలువ కోసం భూముల కోల్పోయిన వారి పరిస్థితి దయనీయంగా మారింది. మొత్తం ఈ కాలువ నిర్మాణానికి 3,026 ఎకరాల భూమి అవసరమైతే ఇప్పటి వరకు కేవలం 650 మంది రైతుల నుంచి 555 ఎకరాల భూమి సేకరించేందుకు సర్వే చేశారు. అయితే అదనంగా 400ల ఎకరాల భూములను సేకరించేందుకు సర్వేచేసి క్లియరెన్స్ కోసం పంపారు. కాగా మొత్తం 3,026 ఎకరాలకు గాను భూమి కోల్పోయిన రైతుల వివరాలు సేకరించి వీరందరికీ నష్టపరిహారం అందజేయాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రక్రియ ఇంకా పూర్తి కావడం లేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పరిహారం డబ్బుల చెల్లింపు విషయాల్లో వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

27 నెంబర్ ప్యాకేజీ కాలువది ఇదే దుస్థితి

నిర్మల్ నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన 27 నెంబర్ ప్యాకేజీ హైలెవల్ కాలువ పనులు సైతం ఇప్పటికీ పూర్తి కాలేదు. ముఖ్యంగా భూసేకరణ దానికి సంబంధించి పరిహారం డబ్బుల మంజూరులో జరిగిన ఆలస్యం కారణంగా సదరు కాంట్రాక్టర్ పనులు చేయకుండా వెనుదిరిగారు. కాగా భూ సేకరణ కోసం మొదట రూ.108 కోట్లను మంజూరు చేశారు. దీంతో 1677 ఎకరాల భూసేకరణ జరిపారు. ఇంకా 823 ఎకరాల భూ సేకరణ జరపాల్సి ఉంది. దీనికోసం ఇంకా రూ.87 కోట్లు అవసరం కానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మంత్రి పొంగులేటి పైనే ఆశలు

ఇదిలా ఉండగా జిల్లాలో సాగునీటి కాలువలు బ్యారేజీల నిర్మాణం కోసం సేకరించిన భూములకు సంబంధించి పరిహారం డబ్బులు ఎప్పటికప్పుడు మంజూరు కాకపోతుండడం భూములు కోల్పోయిన రైతులకు శాపంగా మారుతోంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు భూసేకరణకు సంబంధించి నిధులు విడుదల చేయాల్సినప్పటికీ ఆ దిశగా దృష్టి సారించలేకపోతుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు పనులకు సైతం ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఏళ్ల నుంచి పనులు నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో శుక్రవారం పర్యటించనున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి పరిహారం సమస్యను తీసుకవెళ్లేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో రైతులు ఈ ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరిస్తుందని ఎదురు చూస్తున్నారు.



కాళేశ్వరం పథకం ప్యాకేజీ నెంబర్ 28 కింద నిర్మాణం పనులు చేపట్టిన దృశ్యం



భూ సేకరణ జరుపుతున్న అధికారులు (ఫైల్)

డబుల్‌బెడ్‌రూమ్‌లను ఆక్రమించుకున్న పేదలు

నర్సాపూర్(జి), మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నిర్మించిన యాభై డబుల్‌బెడ్ రూమ్‌లను పేదలు గురువారం ఆక్రమించుకున్నారు. నూతనంగా గృహప్రవేశం చేసి పాలు పొంగించి వంటచేసుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు పోచంపాడ్ ప్రాజెక్టులో ముంపునకు గురైన ప్రాంత మహిళలను గుర్తించి డబుల్‌బెడ్ రూమ్‌లను అందజేయాలని తహసీల్దార్‌కు వేడుకున్నారు. తహసీల్దార్ సోమ శ్రీనివాస్, గిర్దావర్ నవతజ్యోతి, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఎస్సై సాయికిరణ్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్దకు వెళ్లి సామాన్లు ఖాళీ చేయించి ఇళ్లకు తాళాలు వేశారు. పేద మహిళలు కలెక్టర్ వచ్చేంత వరకు ఇక్కడే వంట చేసుకుంటామని తెగించి చెప్పడంతో చేసేదేమీ లేక అధికారులు అక్కడే కూర్చుకున్నారు. తహసీల్దార్ సోమశ్రీనివాస్ మాట్లాడుతూ... గ్రామస్థులు నిరుపేదల కుటుంబాలకు చెందిన మహిళలు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లను ఇచ్చి మండల తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. సాయంత్రం ఏడుగంటల సమయం వరకు అక్కడే కూర్చుని నిరసన వ్యక్తం చేశారు.



మహిళలను సముదాయిస్తున్న తహసీల్దార్ సోమ శ్రీనివాస్, పోలీసులు

నేడు జిల్లాలో రెవెన్యూ శాఖ మంత్రి పర్యటన

● బందోబస్తు ఏర్పాట్లు పూర్తి



భైంసాలోని హెలిప్యాడ్ స్థలివద్ద బందోబస్తు ఏర్పాట్లను సమీక్షిస్తున్న ఏఎస్పీ

నిర్మల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో కుంటాల మండల కేంద్రంలో జరుగనున్న మంత్రి పొంగులేటి పర్యటనకు అధికార యంత్రం ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడి ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాట్లపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీ అవినాష్ కుమార్‌లతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. మంత్రి పర్యటన సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులతో సమీక్షించి, తగుసూచనలు చేశారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

భూ భారతి చట్టంపై అవగాహన కోసం...

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టం కార్యక్రమాన్ని ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ఆలోచనతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన ఖరారు చేసినట్లు చెబుతున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్‌లో భైంసా చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కుంటాలకు చేరుకుని మండల కేంద్రంలో జరిగే సదస్సులో పాల్గొంటారు.

భైంసా : భూభారతి కార్యక్రమంలో భాగంగా కుంటాల మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేపట్టనున్న పర్యటనకు పోలీసు శాఖ భారీ బందోబస్తు చర్యలు చేపట్టింది. మంత్రి హైదరాబాద్ నుంచి భైంసా వరకు హెలికాప్టర్ ద్వారా రానున్నారు. ఇక్కడి నుంచి కుంటాల మండల కేంద్రానికి రోడ్డుమార్గంలో వెళ్లనున్నారు. ఇందుకోసం గాను భైంసాలోని పార్డీ (బీ) బైపాస్ రోడ్డుమార్గంలో అధికారులు హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటనకు పోలీసుశాఖ పటిష్ట భద్రతా చర్యలకు ఉపక్రమించింది. జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిల్ నేతృత్వంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ సారథ్యంలో భైంసాటౌన్, రూరల్ సీఐలు గోపినాథ్, నైలు బందోబస్తు చర్యలు చేపట్టారు. గురువారం భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి పర్యటన ఆద్యాంతం ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ఠ బందోబస్తు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే భైంసాలోని హెలిప్యాడ్ వద్ద ఏడుగురు పోలీసు అధికారులు, 55 మంది పోలీసు సిబ్బందితో కలిపి ప్రణాళికబద్ధమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. హెలిప్యాడ్ స్థలివద్ద భైంసాటౌన్ సీఐ గోపినాథ్ బందోబస్తు పర్యవేక్షిస్తుండగా మంత్రి ప్రయాణించే రోడ్డుమార్గంతో పాటు భూభారతి నిర్వహించే కుంటాల మండల కేంద్రంలోని సభాస్థలి వద్ద భైంసా రూరల్ సీఐ నైలు భద్రతా చర్యలు చేపట్టారు. మంత్రి పర్యటనను పురస్కరించుకొని రోడ్డుమార్గంలోని ప్రతి వంతెనతో పాటు గ్రామాల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

నేడు కుంటాలకు మంత్రుల రాక

కుంటాల : మండలంలోని భూ భారతి పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైనందున గురువారం మండల కేంద్రం కుంటాలలో జరిగే భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కలు గ్రామ సభలో పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. భూ భారతి పథకంపై నిర్వహించే అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొంటారని, కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ఆమె సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అటవీశాఖతో ఉన్న భూ వివాదాలపై రెవెన్యూ, అటవీశాఖల అధికారులు కలిసి సర్వేచేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి మండలానికి సంబంధించిన భూముల వివరాలతో సమగ్ర ప్రొఫై ల్ తయారుచేయాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశిం చారు. భూభారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలుచేస్తున్న కుంటాల మండలంలో ప్రస్తుతం ఉన్న భూసమస్యల పరిష్కార దశలను కలె క్టర్ అధికారులతో చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

కరపత్రాల ఆవిష్కరణ

నిర్మల్ రూరల్ : జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల మస్కాపూర్ కరపత్రాలను గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు, కుర్ర శేఖర్, వెన్నం అంజన్న, షేక్ ఇమ్రాన్, రాపర్తి కిషన్ ప్రసాద్, బి. రవి కుమార్‌లు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ స్థల పరిశీలన కోసం

కలెక్టర్‌ను కలిసిన కేంద్ర బృందం

నిర్మల్ అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు సంబంధించి గురువారం కేంద్రీయ విద్యా లయ దక్షిణ భారత విభాగం డిప్యూటీ కమిషనర్ మంజునాథం, అసిస్టెంట్ కమిషనర్ అనురాధ జిల్లా కలెక్టర్ అభి లాష అభినవ్‌ను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాసర మండలంలో కేంద్రీయ విద్యాలయ స్థాపనకు అవసరమైన స్థలాలను బృందం పరిశీలించిన విషయాన్ని కలెక్టర్‌కు వివరించారు. వసతి, మౌలిక సదుపాయాలపై చర్చించారు. కేంద్ర విద్యాలయ నిర్మాణానికి అనుకూలమైన ప్రాంతాన్ని గుర్తిం చేందుకు భౌగోళిక పరిస్థితులు, కమ్యూనికేషన్ సదుపాయాలు, భవిష్యత్ అవసరాలన్నింటినీ పరిగ ణలోకి తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. సమావేశంలో ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసిన డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్

రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయండి

● అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన లబ్ధి దారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన ఈ పథకం లబ్ధిదారుల ఎంపికపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. దరఖాస్తుల పరిశీలన, ప్రస్తు తస్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, మండలాల వారీగా ఎంపిక ప్రక్రియను రేపటిలోగా పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వాటిని బ్యాంకులకు పంపించే ప్రక్రియను వేగంతం చేయాలన్నారు. బ్యాంక్‌లకు చేరిన దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తిచేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో గోవింద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్

● ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

నిర్మల్ కల్చరల్ : ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. గురువారం నారాయణ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. శిక్షణలో అంశాలు బోధనలో జోడించి విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. శిక్షణకు క్రమం తప్పకుండా హాజరై సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డిజిటల్ బోధన పద్ధతులు, అభ్యసన ఫలితాల సాధన, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కృత్యాధార బోధనకు ప్రాధాన్యమివ్వాలని అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎఫ్ఏవో రమణారెడ్డి, ఏఎంవో నర్సయ్య, డీఆర్పీలున్నారు.